క్లుప్తంగా

పకడ్బందీగా ఓటర్ల ఇంటింటి సర్వే

నేలకొండపల్లి: ఓటర్ల జాబితా పారదర్శకంగా రూపొందించేందుకు ఇంటింటి సర్వే పకడ్బందీగా చేపట్టాలని పాలేరు నియోజకవర్గ ఎన్నికల విభాగం డీటీ రవీందర్ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆయన బూత్ లెవల్ ఆఫీసర్లతో సమావేశమయ్యారు. ప్రతీ గ్రామంలో ప్రతీ ఇంటిని సందర్శించి జాబితా ఆధారంగా ఓటర్లు ఉన్నారా, లేరా అని ఆరా తీసి మార్పులు, చేర్పులపై యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ ఎం.యర్రయ్య, తహసీల్దార ఇమ్రాన్, ఎంఆర్‌ఐలు ఆలస్యం మధుసూదన్‌రావు, రవి, సుందర్‌సింగ్, ఆపరేటర్ ఈ.మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన పలువురు...

ఖమ్మం మామిళ్లగూడెం: ఇటీవల ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారం చేసిన అమేర్ అలీఖాన్‌ను విద్యావేత్త ఎండీ.అసద్, ఉర్దూ జర్నలిస్టు ఎం.డీ.జవ్వాద్ అహ్మద్‌తో పాటు ఎం.డీ.షఫీ తదితరులు శుక్రవారం హైదరాబాద్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అన్యాక్రాంతమవుతున్న వక్ఫ్‌భూములను కాపాడేలా సమగ్ర సర్వే చేయించాలని కోరారు. అలాగే, రెసిడెన్షియల్ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, ఉర్దూ పత్రిక జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్లు ఇప్పించాలని వినతిపత్రం అందజేశారు.

రుణమాఫీ కాకపోతే అధికారులను సంప్రదించాలి

రఘునాథపాలెం: అర్హులైన రైతులందరికీ రూ.2 లక్షలలోపు రుణమాఫీ చేసేందుకు రాష్ట్రప్రభుత్వం కట్టుబడి ఉందని రఘునాథపాలెం సొసైటీ చైర్మన్ తాతా రఘురాం తెలిపారు. సొసైటీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎవరికైనా రుణమాఫీ కాకపోతే ఆందోళన చెందాల్సిన పనిలేదని చెప్పారు. ఆధార్ కార్డులు, కుటుంబ సభ్యుల నిర్ధారణ పత్రాలు తదితర పూర్తి వివరాలతో వ్యవసాయ అధికారులను కలిస్తే ఆన్‌లైన్‌లో నమోదు చేసి రుణమాఫీ వర్తించేలా చర్యలు తీసుకుంటారని తెలిపారు.

ట్రాఫిక్ సీఐ-2గా సాంబశివరావు

ఖమ్మంక్రైం: ఖమ్మం ట్రాఫిక్ సీఐ-2గా సాంబశివరావు నియమితులయ్యారు. ప్రస్తుతం రిజర్వ్ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న ఆయనను ఖమ్మం ట్రాఫిక్‌కు బదిలీ చేస్తూ ఐటీ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఆయన ఖమ్మంలో పనిచేసి మహబూబాబాద్ జిల్లాకు వెళ్లగా.. తిరిగి ఖమ్మం వచ్చి హెడ్‌క్వార్టర్స్‌లో కొనసాగుతున్నారు.

'లిఫ్ట్' కమిటీ ఎన్నిక

నేలకొండపల్లి: మండలంలోని మోటాపురంలో ఎత్తిపోతల పథకం నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా శ్రీనివాస్, కార్యదర్శిగా వెంకటేశ్వర్లుతో పాటు కార్యవర్గ సభ్యులుగా జి.మధు, లక్ష్మణ్, వెంకట్, రాములను ఎన్నుకోగా పలు తీర్మానాలు చేసినట్లు తెలిపారు.

ప్రమాదంపై ఫిర్యాదు

నేలకొండపల్లి: కారు ఢీకొనగా ఓ వ్యక్తి గాయపడిన ఘటనపై శుక్రవారం ఫిర్యాదు చేశారు. మండలంలోని బోదులబండకు చెందిన పుల్లయ్య ఈనెల 19న బైక్‌పై వెళ్తుండగా కోదాడ నుంచి ఖమ్మం వెళ్తున్న కారు ఢీకొట్టడంతో గాయాలయ్యాయి. ప్రస్తుతం ఆయన హైదరాబాద్‌లో చికిత్స పొందుతుండగా కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నగరంలో సినిమాలు

తిరుమల	డిమాంట్ కాలనీ-2
వినోద	ఆయ్
సాయిరాం	తంగలాన్
ఆదిత్య	మారుతినగర్ సుబ్రమణ్యం, కమిటీ కుర్రోళ్లు
శ్రీనివాస	డబుల్ ఇస్మార్ట్
సీఎస్ సినీ గెలాక్సీ	డబుల్ ఇస్మార్ట్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	26	బచ్చలికూర	4
వంకాయ	30		20
బెండకాయ	24	పాలకూర	3
పచ్చిమిర్చి	36		20
కాకర	26	చుక్కకూర	3
బోడ కాకర	150		20
బీర	36	తోటకూర	2
దొండ	30		10
పొట్లకాయ	36	గోంగూర	5
చిక్కుడు	46		20
గోరుచిక్కుడు	30	మెంతికూర	2
క్యాబేజీ	26		20
క్యాలీఫ్లవర్	40	కొత్తిమీర	1
ఆలుగడ్డ	40		25
చామగడ్డ	46	పుదీన	1
క్యారెట్	56		25
బీన్స్	66	-ఖమ్మం వ్యవసాయం	

స్మార్ట్‌గా ఫిర్యాదు చేయండి

సిటిజన్ బడ్డీ యాప్‌లో సమస్యల నమోదు..

- ఫిర్యాదుల పరిష్కారంతోపాటు పౌరసేవలు
- కార్యాలయానికి వెళ్లకుండానే దరఖాస్తులు
- 2018 నుండి ఇప్పటి వరకు 12,787 ఫిర్యాదుల నమోదు
- పారిశుద్ధ్యం, ఇంజనీరింగ్ విభాగాలకే అత్యధికం



సిటిజన్ బడ్డీ యాప్ ద్వారా అందించే సేవలు

ఖమ్మంమయూరిసెంటర్: కార్పొరేషన్ పరిధిలో ఏ సమస్య ఉన్నా ఇంటి నుంచే ఫిర్యాదు చేసి పరిష్కరించుకునే వెసులుబాటు మున్సిపల్ శాఖ కల్పించింది. రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగకుండా చేతిలో స్మార్ట్ ఫోన్ చాలు.. యాప్‌పై క్లిక్ ఇస్తే చాలు సమస్య అధికారుల దరికి చేరుతుంది. ప్రభుత్వం మున్సిపల్ శాఖ ద్వారా ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించడంతో పాటు పౌర సేవలు అందించేందుకు కొన్నేళ్ల క్రితం సిటిజన్ బడ్డీ యాప్‌ను తీసుకొచ్చింది. ప్రజల కోసం రూపొందించిన యాప్‌లో ఫిర్యాదుల స్వీకరణకు మున్సిపల్ శాఖ, అధికారులు పెద్దపీట వేశారు. ఈ యాప్ నగర ప్రజలకు ఆరేళ్లుగా అందుబాటులో ఉన్నప్పటికీ ఇటీవల ఉపయోగించుకుంటున్న వారి సంఖ్య పెరుగుతోంది. కార్పొరేషన్‌లోని వివిధ విభాగాలకు సంబంధించిన సమస్యలపై ఫిర్యాదు చేయడంతో పాటు పౌరసేవలు వినియోగించుకోవడం, తమ ప్రాంత సమాచారం తెలుసుకునేలా యాప్‌లో వివరాలు పొందుపరిచారు.

అన్నీ యాప్‌లోనే..

మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో ప్రజలు ఈ యాప్‌ను వినియోగించుకునే వెసులుబాటు ఉంది. యాప్‌లో కార్పొరేషన్ సమాచారంతో పాటు ప్రజాప్రతినిధులు, ఆయా ప్రాంతాల అధికారులు, సిబ్బంది జాబితా, కమిషనర్, కార్యాలయ ఫోన్ నంబర్లు కూడా ఉంటాయి. ఇక పన్ను చెల్లింపులు, ఫిర్యాదులు, ఆన్‌లైన్ సేవలు, దరఖాస్తు పత్రాలు, ఇతర సేవలు అందుబాటులో ఉన్నాయి. కేఎంసీ పరిధిలో పరిపాలన, ఇంజనీరింగ్, రెవెన్యూ, శానిటేషన్, టౌన్ ప్లానింగ్ విభాగాలకు సంబంధించిన సేవలను ఉపయోగించుకోవచ్చు.

సత్వర సేవలు..

పౌర సేవలు, సమాచారం ఇస్తూనే ఏ సమస్య ఉన్నా యాప్ ద్వారా తెలియజేసేలా ఏర్పాట్లు చేశారు. పారిశుద్ధ్యం, డ్రెయినేజీలు, రోడ్లు, సఫాయిమిత్ర సురక్ష, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, అనధికార కట్టడాలు, ఉల్లంఘనల నివేదన, ఆదాయం, వీధి వ్యాపారుల సమస్య, ఆహార పరిశుభ్రత, భద్రత, ఇతర సమస్యలపై ప్రజలు ఫిర్యాదులను చేయొచ్చు. అంతేకాక యాప్ అందే సమస్యలను గడువులో పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కేఎంసీలో ఈ ఫిర్యాదులను పరిశీలించి విభాగాల వారీగా చేరవేసేలా ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశారు. ఈ సెల్‌లో నిరంతరం యాప్‌ను పరిశీలించి వచ్చిన దరఖాస్తులను విభాగాలకు పంపడంతో పాటు ఎన్ని రోజుల్లో సమస్య పరిష్కారం అవుతుందనే విషయాన్ని ఫిర్యాదుదారుడు, దరఖాస్తుదారుడుకు మెసేజ్ పంపిస్తున్నారు. అంతేకాక ఫిర్యాదు పరిష్కారమయ్యాక ఫిర్యాదుదారుడి నుండి ఫీడ్‌బ్యాక్ సైతం తీసుకుంటారు.

బడ్డీ యాప్‌పై ప్రత్యేక దృష్టి

ప్రజలకు సమస్య ఎదురైనప్పుడు కార్యాలయానికి వచ్చే అవసరం లేకుండా యాప్ ద్వారానే ఫిర్యాదు చేయొచ్చు. ఈ విషయమై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేలా కేఎంసీ కమిషనర్ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. నగరంలోని ప్రతీ పౌరుడు తమ స్మార్ట్‌ఫోన్‌లో సిటిజన్ బడ్డీ యాప్ డౌన్‌లోడ్ చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నారు. అంతేకాక యాప్ ద్వారా అందే ఫిర్యాదులను గడువులోగా పరిష్కరించేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల బదిలీపై వెళ్లిన అధికారులు, సిబ్బంది పేర్లు తొలగించి కొత్త అధికారుల పేర్లు, ఫోన్ నంబర్లను ఇప్పటికే యాప్‌లో నమోదు చేయించారు.

2018 నుండి ఇప్పటి వరకు యాప్‌కు వచ్చిన ఫిర్యాదుల వివరాలు

విభాగం	ఫిర్యాదులు	పెండింగ్
పారిశుద్ధ్యం	6,171	10
ఇంజనీరింగ్	3,727	108
ఎలక్ట్రికల్	1,352	13
టౌన్ ప్లానింగ్	707	48
రెవెన్యూ	452	19
అడ్మినిస్ట్రేషన్	346	-
ఇతరాలు	32	-

రోజుకు 50కు పైగానే ఫిర్యాదులు



సమస్య ఎదురైతే ప్రజలు కేఎంసీ కార్యాలయానికి రాకుండానే సిటిజన్ బడ్డీ యాప్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చు. ప్రస్తుతం రోజుకు 50 నుండి 60 ఫిర్యాదులు అందుతున్నాయి. ఫిర్యాదు నమోదు కాగానే విభాగాల వారీగా అధికారులు పరిష్కారానికి చర్యలు చేపడతారు. నగర వాసులంతా స్మార్ట్ ఫోన్‌లో సిటిజన్ బడ్డీ యాప్ డౌన్‌లోడ్ చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నాం.

– అభిషేక్ అగస్త్య, కమిషనర్, కేఎంసీ


కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

జలాంజనేయ స్వామి ఆలయంలో కుంకుమ పూజలు

ఖమ్మంగాంధీచౌక్: శ్రావణమాసం శుక్రవారం సందర్భంగా ఖమ్మంలోని శ్రీ జలాంజనేయ స్వామి ఆలయంలో విశ్వహిందూ పరిషత్ దుర్గావాహిని ఆధ్వర్యాన సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు బోనాల రామకృష్ణ, దుర్గావాహిని జిల్లా అధ్యక్షురాలు కనగంటి నాగమణితో పాటుబొడ్డు కృష్ణ, పసుమర్తి రవికుమార్, తాటికొండ రామకృష్ణ, కొప్పుల ప్రభావతి రెడ్డి, భూక్యా సోని, పద్మ, అనూష, ధనలక్ష్మి, చంద్రావతి, నాగమణి, భానుమతి, గౌరమ్మ, రుద్ర, విజయమ్మ, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి


నేలకొండపల్లిలో ఏఈఓలకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నేలకొండపల్లి: ఎన్నికల సమయాన ఇచ్చిన హామీ మేరకు షరతులు లేకుండా రైతుల రుణాలు మాఫీ చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏఈఓలకు వినతిపత్రం అందించాక పొట్టి శ్రీరాములు సెంటర్‌లో రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం రైతులను ఇబ్బంది పెట్టకుండా వెంటనే రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. మాజీ ఎంపీపీ తీగ వెంకటేశ్వర్లుతో పాటు సీపీఎం, టీడీపీ నాయకులు రచ్చా నర్సింహారావు, ఏటుకూరి రామారావు, కే.వీ.రెడ్డి, మార్తి కొండలు, నర్సయ్య, నాగేశ్వరరావు, దుగ్గి వెంకటేశ్వర్లు, ఇంటూరి అశోక్, భూక్యా కృష్ణ, పెద్దిరాజు నర్సయ్య, ఎస్.మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

27న కలెక్టరేట్ ముట్టడి

ఖమ్మంరూరల్: పూర్తిస్థాయిలో రుణమాఫీ అమలు చేయాలనే డిమాండ్‌తో ఈనెల 27న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలంగాణ రైతు సంఘం నాయకుడు బి.రమేష్ తెలిపారు. మండలంలోని వరంగల్ క్రాస్‌రోడ్డులో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ధర్నాకు రైతులు తరలివచ్చివిజయవంతం చేయాలని కోరారు. నాయకులు డి.రామయ్య, నంద్ర ప్రసాద్, టి.వెంకటేశ్వర్లు, పి.సంగయ్య, నాగేశ్వరరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్

బీమా చెక్కు అందజేసిన మాజీ మంత్రి పువ్వాడ


శ్రీనివాసరావు కుటుంబీకులకు చెక్కు అందజేస్తున్న పువ్వాడ అజయ్

ఖమ్మంఅర్బన్: కార్యకర్తలకు బీఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తుందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. మార్బుల్ వర్కర్‌గా పనిచేస్తూ బీఆర్ఎస్ సభ్యత్వం తీసుకున్న ఖమ్మం 14వ డివిజన్ గొల్లగూడెంకు చెందిన ఇసంపల్లి శ్రీనివాసరావు ఇటీవల విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఈమేరకు రూ.2లక్షల బీమా చెక్కును శుక్రవారం ఆయన భార్య ఉపేంద్రమ్మకు పువ్వాడ అందజేసి మాట్లాడారు. బీఆర్ఎస్ కార్యకర్తలెవరూ అధైర్యపడొద్దని, అందరికీ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. కార్పొరేటర్ కూరాకుల వలరాజు, నాయకులు జానీ, రామనర్సయ్య, దస్తగిరి, కోటి, నాగరాజు, అశోక్, సతీష్, వెంకన్న, శరత్ పాల్గొన్నారు.

రేపు మెగా సంగీత విభావరి


ఆహ్వాన పత్రికలు ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

ఖమ్మంవ్యవసాయం: శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా ఆదివారం ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో మెగా సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు స్వర సుధ మ్యూజిక్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఖమ్మంలోని అసోసియేషన్ కార్యాలయంలో ఆహ్వాన పత్రికలను శుక్రవారం విడుదల చేయగా అసోసియేషన్ అధ్యక్షుడు కొమర్రాజు మాధవరావు మాట్లాడారు. ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు మొదలయ్యే సంగీత విభావరిలో లాస్య బృందం సినీ జానపద నృత్యాలను ప్రదర్శించనుండగా, వివిధ ప్రాంతాల గాయనీ, గాయకులు గీతాలను ఆలపిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ బాధ్యులు డాక్టర్ వనం కృష్ణవేణి, పారుపల్లి సురేష్, వీవీ.రెడ్డి, పీజే.వినయ్‌కుమార్, కేవీ.రమణారావు, ఊటుకూరి శ్రీనివాసరావు, పిన్నెల్లి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే సీజనల్ వ్యాధులు దూరం


దోమల లార్వాలను గుర్తిస్తున్న డీఎల్‌పీఓ, సిబ్బంది

తిరుమలాయపాలెం: సీజనల్ వ్యాధుల వ్యాప్తి నేపథ్యాన పంచాయతీ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎల్‌పీఓ రాంబాబు ఆదేశించారు. మండలంలోని అజ్మీరా తండా, తిరుమలాయపాలెం గ్రామాల్లో శుక్రవారం ఆయన ఫ్రై డే – డ్రై డే కార్యక్రమాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా అజ్మీరాతండాలో వైద్యశిబిరాన్ని పరిశీలించారు. అనంతరం డీఎల్‌పీఓ మాట్లాడుతూ ప్రజలంతా వ్యక్తిగతంగానే పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ దోమల బారిన పడకుండా కాపాడుకోవాలని సూచించారు. ఎంపీఓ పి.సూర్యనారాయణ, పీహెచ్‌సీ వైద్యాధికారి అలివేలు, గ్రామపంచాయతీల కార్యదర్శులు అనూష, సునీత పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంకు పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న న్యూవిజన్ చైర్మన్ సీహెచ్‌జీకే.ప్రసాద్



సర్టిఫికెట్లు అందుకుంటున్న బ్లూమింగ్ మైండ్స్ స్కూల్ విద్యార్థులు

ఖమ్మంగాంధీచౌక్/ఖమ్మంసహకారనగర్: యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యాన వరంగల్‌లో నిర్వహించిన 'యూ జీనియస్' క్విజ్ పోటీల్లో ఖమ్మం విద్యార్థులు ప్రతిభ చాటారు. నగరంలోని న్యూవిజన్ పాఠశాల 9వ తరగతి విద్యార్థులు ఎండీ.అయాన్ ఆజాం, ఉజ్వల్ కృష్ణ మొదటి స్థానంలో నిలిచి జాతీయ స్థాయిలో జరిగే సెమీ ఫైనల్స్‌కు అర్హత సాధించారు. అలాగే, బ్లూమింగ్ మైండ్స్ సెంట్రల్ పబ్లిక్ స్కూల్ పదో తరగతి విద్యార్థులు బెస్వంత్‌కుమార్, సాత్విక ద్వితీయ స్థానం సాధించారు. విద్యార్థులను బ్యాంక్ ఖమ్మం రీజనల్ హెడ్, డిప్యూటీ జనరల్ మేనేజర్ హన్మంతరెడ్డి అభినందించారు. కాగా, న్యూవిజన్ విద్యార్థులు అయాన్ ఆజాం, ఉజ్వల్ కృష్ణను చైర్మన్ సీహెచ్‌జీకే.ప్రసాద్, డైరెక్టర్లు గోపీచంద్, సీహెచ్.కార్తీక్, ప్రిన్సిపాళ్లు ఎం.డీ.అబాద్ అలీ, జే.వీ. మైఖేల్, ఉపాధ్యాయులు శివాజీ, ఖాదర్ అభినందించారు.

పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం

నేలకొండపల్లి: అందరూ ఇళ్లలోనే కాకుండా పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా వ్యాధుల బారిన పడకుండా కాపాడుకోవచ్చని నేలకొండపల్లి ఎంపీడీఓ ఎం.ఎర్రయ్య తెలిపారు. మండలంలోని చెన్నారంలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈమేరకు గ్రామాలో పారిశుద్ధ్య పనులు చేపడుతున్నందున ప్రజలు కూడా ఇళ్ల ముందు చెత్త వేయొద్దని, రహదారులపై పశువులను కట్టేయవద్దని సూచించారు. ఐకేపీ ఏపీఎం జి.అశోక్‌రాణి, పంచాయతీ కార్యదర్శి నరేష్ పాల్గొన్నారు.

షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాల నిర్వహణ

రఘునాథపాలెం: అంగన్‌వాడీ సెంటర్లలో షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలను కచ్చితంగా నిర్వహించాలని ఖమ్మం అర్బన్ సీడీపీఓ వీరభద్రమ్మ సూచించారు. రఘునాథపాలెం రైతువేదికలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కేంద్రాల్లో పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం పంపిణీ, తదితర అంశాలపై సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నేలకొండపల్లి: మండలంలోని కొత్తకొత్తూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ కె.రామారావు తెలిపారు. నేలకొండపల్లి, కొత్తకొత్తూరు, పాతకొత్తూరు, తిరుమలాపురం, పైనంపల్లి, బోదులబండ, రామచంద్రాపురం, అనంతనగర్, కోరట్లగూడెం గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిచిపోతుందని వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కూసుమంచి: కూసుమంచిలోని సోనియానగర్ వద్ద శుక్రవారం రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని తురకగూడెంకు చెందిన నరేష్, గోరీలపాడుతండాకు చెందిన శ్రీను ఈ ప్రమాదంలో గాయపడగా 108లో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

వృద్ధురాలు ఆత్మహత్య

ఖమ్మంక్రైం: ఖమ్మం వెంకటేశ్వరనగర్‌కు చెందిన ఒగ్గు సుగణమ్మ(70) ఆత్మహత్య చేసుకుంది. ఆమె భర్త 12ఏళ్ల క్రితం మృతి చెందగా అప్పటి నుంచి మానసికంగా ఇబ్బంది పడుతుండడంతో చికిత్స చేయిస్తున్నారు. ఈక్రమంలో గురువారం తెల్లవారుజామున పురుగుల మందు తాగగా కుటుంబీకులు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. ఆమెకు కుమారుడు, కుమార్తె ఉండగా కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ రమేష్ తెలిపారు.

రాష్ట్రప్రభుత్వం హామీలన్నీ అమలుచేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: ఎన్నికల సమయాన ఇచ్చిన హామీలన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఖమ్మం సుందరయ్య భవన్‌లో మెరుగు సత్యనారాయణ అధ్యక్షతన శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీజనల్ వ్యాధులతో బాధపడుతున్న ప్రజలకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరైన వైద్యం అందడం లేదని తెలిపారు. ఈమేరకు గ్రామాల్లో సంచార వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి వైద్యం అందించాలన్నారు. అలాగే, అధికార, ప్రతిపక్షాల నాయకులు విమర్శలు, ప్రతివిమర్శలకు పరిమితం కాకుండా పేదల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు ఎర్రా శ్రీనివాసరావు, కొండబోయిన నాగేశ్వరరావు, తాళ్లపల్లి కృష్ణ, జాజిరి శ్రీనివాసరావు, ప్రతాపనేని వెంకటేశ్వర్లు, తేలపోలు రాధాకృష్ణ, పి.సంగయ్య, వడ్లమూడి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో జాతీయ అంతరిక్ష దినోత్సవం


త్రివేణి పాఠశాలలో బహుమతులు అందుకున్న విద్యార్థులతో యజమాన్య ప్రతినిధులు


ప్రియదర్శిని కళాశాలలో రాకెట్ల మోడళ్లతో విద్యార్థినులు, అధ్యాపకులు

ఖమ్మం సహకారనగర్/ఖమ్మం రూరల్: జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని శుక్రవారం ఖమ్మంలోని త్రివేణి పాఠశాలలో నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల డైరెక్టర్ గొల్లపుడి వీరేంద్రచౌదరి మాట్లాడుతూ ఇస్రో ప్రపంచంలోనే ముందు వరుసలో నిలుస్తోందని తెలిపారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాసం, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కృష్ణవేణి త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావుతో పాటు కాట్రగడ్డ మురళీకృష్ణ, స్వప్న, ముస్తఫా, శ్రీదేవి, చార్లెస్, సందీప్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, ఖమ్మంరూరల్ మండలం పెదతండాలోని ప్రియదర్శిని ఇంజనీరింగ్ మహిళా కళాశాలలో నిర్వహించిన జాతీయ అంతరిక్ష దినోత్సవంలో కళాశాల చైర్మన్ కె.నవీన్‌బాబు మాట్లాడారు. అనంతరం విద్యార్థినులు రూపొందించిన రాకెట్లను నమూనాలను ప్రదర్శించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బి.గోపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

ఇంత నిర్లక్ష్యమా ?



నగరంలోని పలు ఆస్పత్రులు, మెడికల్ షాపుల నిర్వాహకుల నిర్లక్ష్యంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గడువు తీరిన మందులను ప్రత్యేక కవర్లలో ప్యాక్ చేసి డంపింగ్ యార్డ్‌కు పంపించాలి. కానీ ఖమ్మంలోని కొందరు మెడికల్ షాపులు, ఆస్పత్రుల యజమానులు కాలం చెల్లిన మందులను రహదారుల వెంట కుప్పలుగా ఇష్టారాజ్యంగా పడేస్తున్నారు. ఇదంతా బహిరంగంగానే జరుగుతున్నా కేఎంసీ అధికారులు చోద్యం చూస్తుండడం విమర్శలకు తావిస్తోంది.

– ఖమ్మం మయూరిసెంటర్

ప్రశ్నించాల్సిన అధికారి : సాంబయ్య, శానిటరీ సూపర్‌వైజర్, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్

సెల్ నంబర్ : 94946 50386